ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న చొక్కాకుల గోవింద్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో శ్రీరావాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు రూ.2 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు ఆయన సోదరుడు, మండల వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ బుధవారం గ్రామ పెద్దలు బోను గంగునాయుడుతో పాటు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సంబంధిత చెక్కు అందజేశారు. సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్టు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి కనకరాజు,గండి దేముడు, మాజీ ఉప సర్పంచ్ రొంగలి వెంకట రమణ,వార్డు మెంబర్లు సింగంపల్లి సింహాచలం, బోను వాసు,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.మండలంలోని ఆదిరెడ్డిపాలెం, సబ్బవరం గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదిరెడ్డిపాలెం సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వివక్షలేని పాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికే ఈ ప్రభుత్వం అందిస్తోందన్నారు. తమ పాలనలో మంచి జరిగితేనే వచ్చే ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధైర్యంగా చెబుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు,ప్రభుత్వ సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా లబ్ధిదారుల ఇంటికే సేవలు అందిస్తున్న వలంటీర్లపై టీడీపీ, జనసేన నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు,జగనన్న సురక్ష కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, వైస్ ఎంపీపీలు దాడి ఝాన్సీ లక్ష్మీ రాణి, చొక్కాకుల గోవింద్,సర్పంచ్ దొడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు,తహసీల్దార్ సత్యానారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, సీఐ రంగనాథం,ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు, పార్టీ సీనియర్ బోకం రామునాయుడు,పల్ల కృష్ణ,యర్రంశెట్టి రాము, దనిమిరెడ్డి శ్రీనివాసరావు,బంతికోళ్ల పద్మ,దొడ్డం పద్మావతి, కాపుశెట్టి శేషుబాబు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆదిరెడ్డిపాలెంలో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సబ్బవరం సచివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఇంటింటా ఓటరు సర్వేకు సహకరించండి

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ కోరారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వరకు జరిగే ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని పలు పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి డేటాను పక్కాగా రూపొందించడం జరుగుతుందన్నారు. ఓటర జాబితాలో కొత్తగా పేర్లు చేర్పులు, తొలగింపులు, సవరణకు సంబంధించిన వివరాలను బీఎల్‌వోలు సేకరిస్తారని చెప్పారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నవీకరించడం జరుగుతుందన్నారు. సమగ్రంగా సర్వే జరిగేందుకు సహకరించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్యామ్, వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేముడు, జనసేన నాయకుడు జనార్దన్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకుడు ఆదారి రమేష్‌నాయుడు, సీపీఐ నాయకుడు ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అజోలా మదర్‌పిట్ తయారీపై శిక్షణ



తానాంలో అజోలా మదర్‌పిట్ తయారు చేయు విధానాన్ని వివరిస్తున్న అధికారులు

పరవాడ: వరి పంటలో నత్రజని ఉత్పత్తి, కలుపు నివారణ కోసం ఆజోల మదర్ పిట్ అనేక విధాలుగా దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి డి.మహాలక్ష్మి చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తానాం గ్రామంలో బుధవారం పైల రామారావు పంట పొలంలో వరి పంటలో ఉపయోగించనున్న ఆజోల మదర్‌ఫిట్‌ను తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. దీన్ని వరి పంటపై ఉపయోగించడం ద్వారా నత్రజని ఉత్పత్తి చేయడంతో పాటు కలుపు నివారణకు చెక్‌పెట్టవచ్చునని వివరించారు. కార్యక్రమంలో రైతులు దేముడు, గొరుపూటి అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సింహాచలం: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆత్మకూరు యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ పరిశోధన కేంద్రాన్ని బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 2019 వరకు రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలు మాత్రమే ఉండేవన్నారు. 2019 తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కొత్తగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టామన్నారు. అందులో ఐదు కళాశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు కూడా ఇస్తున్నామన్నారు. దాంతో 750 సీట్లు కొత్తగా ఈ సంవత్సరం పెరుగుతున్నట్టు తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి వైఎస్సార్ కంటి వెలుగు, స్కూల్ పిల్లలకు కంటి పరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. గడిచిన 26 సంవత్సరాలుగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. శంకర్ ఫౌండేషన్ సేవలను గుర్తించి 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాయుడుతోటలో అత్యంత విలువైన రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయించారన్నారు. ఆ స్థలంలో యాజమాన్యం భారీ భవనాన్ని నిర్మించి, అన్ని సౌకర్యాలతో కంటి చికిత్సలు అందిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు అమలులో రాష్ట్రంలోనే ఉత్తమ కంటి ఆస్పత్రిగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి పేరుగాంచడం, ప్రథమ స్థానం సంపాదించుకోవడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ ఆత్మకూరి శంకరరావు ఆశయాలకు అనుగుణంగా ట్రస్టీలు, డాక్టర్లు, ఉద్యోగులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ అజయ్‌శర్మ, డాక్టర్ శిరీష, డీజీఎంలు కె.బంగార్రాజు, వి.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో అర్హత కలిగిన మత్స్యకార యువతకు ఫార్మా పరిశ్రమల్లో ఉపాధి కల్పించి ఆదుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు బొంది అచ్చిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఎన్‌పీసీ మాన్యు ఫ్రాక్చర్స్ అసోసియేషన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో గ్రామ సభ నిర్వహించి అర్హత కలిగిన మత్స్యకారులకు ఉద్యోగాలు కల్పించడానికి చర్యలు తీసుకోవా లని కోరారు.

ఎంఎస్ఎఫ్-5లో చెత్త నిల్వ ఉంచొద్దు

కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: జోన్-5 పరిధి తాటిచెట్లపాలెం ఎంఎస్‌ఎఫ్‌లో చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జోన్ 3, 4, 5, 8 పరిధిలోని పాత జైల్‌రోడ్డు, జగదాంబ జంక్షన్, తాటిచెట్లపాలెం, పెందుర్తి, సుజాతనగర్, దత్ ఐలాండ్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఏ రోజు చెత్త అదే రోజు తరలించేందుకు మినీ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించారు. పాత జైల్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహ కూడలి పరిసర ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు గల అవకాశాలు, జైల్‌రోడ్డు నుంచి జగదాంబ జంక్షన్ వరకు రహదారి విస్తరణ, జంక్షన్ల అభివృద్ధికి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం 8వ జోన్ పరిధి సుజాతనగర్‌లో పర్యటించి గిరిప్రసాద్ నగర్‌లో నూతనంగా రహదారులు, జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుజాతనగర్‌లో చెత్తను వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, సత్యనారాయణ రాజు, రామ్మోహనరావు, జోనల్ కమిషనర్లు ఆర్‌జీవీ కృష్ణ, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

27న పురందేశ్వరి రాక

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 27న విశాఖ వస్తున్నట్లు ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్ తెలిపారు. అధ్యక్షురాలిగా పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి విశాఖకు వస్తుండటంతో.. ఆమెకు స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పదాధికారులతో సమావేశం నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య సమక్షంలో స్వాగత ఏర్పాట్లపై చర్చించారు. పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి పురందేశ్వరికి స్వాగతం పలకాలని నిర్ణయించారు.

ఏయూలో మేకపాటి ధ్యాన, జ్ఞాన క్షేత్రం

- ప్రారంభమైన నిర్మాణ పనులు
- రూ.2 కోట్లు అందిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో మేకపాటి గౌతం రెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఈ క్షేత్రం నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్‌తో మహాబోధి సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. మహాబోధి సొసైటీ ప్రతినిధి ఆర్.విజయ్‌కుమార్, హనీ గ్రూప్ మేనేజింగ్ పార్టనర్ ఎం.ఓబుల్ రెడ్డి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవ అధ్యయన శాస్త్ర విభాగం ఆచార్యుడు పి.డి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇందు కోసం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.2 కోట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన్‌రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సమాజంలో శాంతిని పెంచే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

అనుసంధానానికి సన్నాహాలు

- విశాఖకు ఏలేరు నీటి తరలింపులో ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ఇంజినీర్ ఇన్ చీఫ్ సతీష్‌కుమార్ వెల్లడి

నాతవరం: ఏలేరు-తాండవ అనుసంధానం పనుల కోసం.. ఏలేరు కాల్వలో నీటి సరఫరాను నిలిపివేయడం వల్ల విశాఖ నగరానికి ఇబ్బంది లేకుండా.. ప్రత్యామ్నాయ మార్గాల కోసం అధికారులు అన్వేషిస్తున్నారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్, ఉత్తర కోస్తా సీఈ ఎస్.సుగుణాకరరావు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నాతవరం మండలం జిల్లేడుపూడిలో ఏలేరు సొరంగం వద్ద తాండవ ప్రాజెక్టు కాల్వలను వారు కాంట్రాక్టరుతో కలిసి పరిశీలించారు.